క్లుప్తంగా

మండల రిసోర్స్ కో ఆర్డినేటర్‌గా సురేష్‌కుమార్


సురేష్ కుమార్

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ (ఎంఆర్‌సీ)గా ఎం సురేష్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన ఏలూరు ఎంపీడీఓ బి.ప్రణవిని కలిసి జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు జారీ చేసిన నియామక ఉత్తర్వులను అందజేశారు. కొన్నేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల రీసోర్స్ కో ఆర్డినేటర్ నియామకాలు జరిగాయి. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఎంఆర్‌సీలను పక్కన పెట్టింది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంఆర్‌సీలు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వీరి సేవలను ఉపయోగించుకుంటూ ఆదేశాలు జారీ చేసింది. స్వచ్ఛభారత్ నిధులతో చేపట్టిన పలు కార్యక్రమాలను వీరు ఎంపీడీఓ ఆదేశాల మేరకు పర్యవేక్షించనున్నారు.

పరిశుభ్రతకు సమయం కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి వ్యక్తి రోజులో రెండు గంటల సమయం పరిశుభ్రతకు వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు పొందుతామని డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు అన్నారు. స్థానిక సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదన్నారు. ప్రతి వ్యక్తి తన చుట్టుపక్కల ఉన్న పరిసరాల శుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్, సెంట్రల్ రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం నానాజీ, సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్, కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శబరికుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

దత్తత పిల్లలను కంటికి రెప్పలా చూడండి


దత్తత తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): దత్తత తీసుకున్న పిల్లలను కంటికి రెప్పలా చూడటంతోపాటు వారిని విద్యావంతులుగా చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం విల్సన్ పాల్ సాయికిరణ్ (13) అనే బాబుని కేరింగ్స్ పోర్టల్ ద్వారా అదిలాబాద్ జిల్లాకు చెందిన తల్లిదండ్రులకు కలెక్టర్ సమక్షంలో దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పెద్ద పిల్లలను దత్తత తీసుకోవటానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సీహెచ్ సూర్యచక్రవేణి, హోమ్ పర్యవేక్షణ అధికారిణి శ్రీవల్లి, శిశు గృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దెందులూరు: విద్యార్థులు క్రమశిక్షణతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాటలో పయనిస్తూ ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) అన్నారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో సెకండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపన్నపాలెం మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు ఉన్నారు.

కొల్లేరులో నిలిచిన జగనన్న ఇళ్లు

- అందుబాటులో లేని సిమెంట్, ఐరన్
- మౌలిక వసతులు, నిధులు లేవు


నిధులు విడుదల కాక మొండికోడులో ఖాళీగా ఉన్న జగనన్న కాలనీ లే అవుట్


చాటపర్రులో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం


చాటపర్రులో అప్పుచేసి కట్టుకుంటున్న ఇళ్లు

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక్కపైసా కూడా బిల్లులు రూపంలో విడుదల చేయలేదని, అధికారులు సిమెంట్, ఇసుక, ఐరన్ ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పుచేసి ఇళ్లు పూర్తి చేసుకుంటున్నామని పలువురు వాపోతున్నారు. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ పనులు సైతం నిలిచిపోయాయి. కనీసం వీధిలైట్లు పంచాయతీ అధికారులు వేయడం లేదంటూ పేదలు గగ్గోల పెడుతున్నారు. రాత్రి వేళ్ల చిమ్మ చీకట్లో జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలో చకచకా పనులు

కొల్లేరు గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతివారం లబ్ధిదారులకు బిల్లులు చెల్లించారు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్, నీటి వసతి కోసం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేశారు. లబ్ధిదారులకు మార్కెట్ రేటు కన్నా తక్కువ రేటుకు సిమెంట్, ఐరన్, ఇసుక అందించారు. పేదలకు అందుబాటులో ఉండేందుకు కాలనీల్లోనే గొడౌన్లు సైతం నిర్మించారు. దీంతో కొల్లేరు గ్రామాల్లో పైడిచింతపాడు, చాటపర్రు, ప్రత్తికోళ్లలంక కోమటిలంక తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగింది. దెందులూరులో నలుగురు హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్లు సిబ్బందితో నిరంతరం పనులు పరివేక్షిస్తున్నారు. వీరితో పాటు తహసీల్దార్, ఈఓపీఆర్డీ, హౌసింగ్ ఇంజినీర్‌కు నాటి కలెక్టర్ ప్రత్యేక టార్గెట్ నిర్దేశించారు. 2020 నుంచి 2023 వరకూ నిర్మాణ పనులు చకచక సాగిపోయాయి. వందల సంఖ్యలో పేదలు గృహ ప్రవేశాలు చేశారు. 2024 ఎన్నికల సమయంలో ఈ మొత్తం ప్రక్రియకు బ్రేక్ పడింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఈ పనులకు నిధులు విడుదల చేయలేదు.

దెందులూరు నియోజకవర్గంలో..

ఇళ్ల నిర్మాణం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.13.1 కోట్లు పేదల బ్యాంక్ ఖాతాల్లో వేసింది. ఏలూరు మండల కొల్లేరు గ్రామాలతో పాటు బెల్ట్ గ్రామాల్లో 3025 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటున్నారు. చాటపర్రులో 453 మంది, గుడివాకలంకలో 356, జాలిపూడిలో 321, మాదేపల్లిలో 494, మల్కాపురంలో 213, శ్రీపర్రులో 660, కోమటిలంకలో 107, పైడిచింతపాడులో 164, ప్రత్తికోళ్లలంకలో 236 వీరితో పాటు పెదయాగనమిల్లిలో 21, కోటేశ్వరదుర్గాపురంలో ముగ్గురు పేదలు స్థలాలు అందుకున్నారు. ఈ స్థలాల్లో నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. నేటి ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తే పనులు పూర్తి చేసుకుంటామని కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



మా గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. 2024 ఎన్నికల తర్వాత పనులు మందకొడిగా సాగుతున్నాయి. లబ్ధిదారులు బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. సిమెంట్, ఐరన్, ఇసుక లేదని అధికారులు చెబుతున్నారు. గత్యంతరం లేక కొందరు అప్పు చేసి ఇళ్లు కట్టుకుంటున్నారు. అధికారులు మాత్రం కొత్త ఇళ్లకు అనుమతి లేదంటున్నారు. లక్షల రూపాయలతో కట్టిన చాటపర్రు కాలనీ ఆర్చీకి సైతం బిల్లులు చెల్లించలేదు.

– కాకర్ల తంబి, జాలిపూడి

బిల్లులు చెల్లించాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదట జగనన్నకాలనీల్లో కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించింది. ఇళ్లకు ఐరన్, సిమెంట్, ఇటుక సులువుగా తరలించేందుకు రోడ్లు వేసింది. దీనివల్ల లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకొచ్చారు. ఇప్పుడు బిల్లులు విడుదల కావడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు మేలు చేయాలి. బిల్లులు వెంటనే విడుదల చేయాలి.

– తంగెళ్ల రాము, ఏలూరు

రెగ్యులరైజ్ చేయాలని వినతి


డీఈ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విద్యుత్ మీటర్ రీడర్స్‌ను రెగ్యులర్ చేయాలని ఏపీ మీటర్ రీడింగ్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఒ.శ్రీనివాసరావు, కోశాధికారి కె.మల్లేశ్వరరావు కోరారు. ఏపీ మీటర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏలూరు జిల్లా మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు డీఈ టెక్నికల్ ఫీర్ అహ్మద్ ఖాన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 20 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో మీటర్ రీడర్స్‌గా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్న సందర్భంలో విద్యుత్ మీటర్‌రీడర్స్ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. కొత్తగా ఏర్పడే సర్కిళ్ల మీటర్ రీడర్స్‌కు క్వాలిఫికేషన్ బట్టి, అర్హతలను బట్టి షిఫ్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, వాచ్‌మెన్‌లు, డ్రైవర్స్, గ్యాంగ్ మేన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ యూనియన్ ఏలూరు డివిజన్ ఉపాధ్యక్షులు కె.మురళి బాబు, అనిల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వృద్ధులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయం సాయం అందిస్తుందని, ప్రభుత్వ పథకాలు, వైద్య సదుపాయాలు పొందటంలో సమస్య తలెత్తితే తమను సంప్రదించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ వృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గృహంలో పరిసరాల పరిశుభ్రతను మెరుగు పర్చాలని సూచించారు. శానిటేషన్‌పై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో..

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని స్థానిక శ్రీరాంనగర్‌లోని జింగిల్ బెల్స్ పాఠశాల, ఏలూరు సన్ రైజ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది కూన కృష్ణారావు, రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లయన్స్ జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరావులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, సేవలు సమాజానికి ఎంతో అవసరమని, వారిపట్ల గౌరవ మర్యాదలు చూపించి, వారి సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సంచాలకులు, క్లబ్ అధ్యక్షుడు వి.సురేష్, ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్‌లో గార్బేజ్ ఫ్రీ ఇండియా కార్యక్రమం



గార్బేజీ ఫ్రీ ఇండియా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గార్బేజీ ఫ్రీ ఇండియా కార్యక్రమాన్ని మంగళవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఐక్యూసీ, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్వారీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కేఎస్ విష్ణుమోహన్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులకు పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై అవగాహన కోసం ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థులు కళాశాల ఆవరణను పరిశుభ్రం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం


3కె సైక్లిథాన్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి తదితరులు


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపు నిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక జూట్ మిల్లు సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మంగళవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. పరిసరాల సరిశుభ్రత కోసం శ్రమదానానికి సమయా న్ని కేటాయిస్తామని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించి తద్వారా స్వచ్ఛ భారత్‌ను సాధించే లక్ష్యంతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి జెండా ఊపి ప్రారంభించారు. జూట్ మిల్లు సెంటర్ నుంచి వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరితో పర్యావరణంపై అవగాహన బాధ్యత కల్పించాలనే ఉద్దేశంతో ఈ సైక్లోథాన్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాను స్వచ్ఛ జిల్లాగా రూపుదిద్దేందుకు సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ ఈవెంట్స్ ద్వారా 98 శాతం పూర్తిచేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచామని చెప్పారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంతో పాటు పరిశుభ్రతపైనా అవగాహన కలిగించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎం ఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాఖ ఉక్కు పరిరక్షణకు 3న దీక్ష


సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 3వ తేదీన ఏలూరులో నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం మంగళవారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులు, మంత్రులు వ్యవహరిస్తున్న తీరు, రాజకీయ నాయకులు ప్రకటనలు చూస్తుంటే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో పెద్ద కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం చెప్పేదానికి, చేస్తున్న పనులకు పొంతనలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఒక్క పైసాకూడా ఖర్చుకాదని తెలిపారు. రూ.లక్ష కోట్లతో సెయిల్ విస్తరణ ప్రణాళిక రూపొందించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 20 మిలియన్ టన్నులకు విస్తరించేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తక్షణం సెయిల్‌లో విలీనం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.పెంటయ్య, వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

దెందులూరు: దెందులూరులోని గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న పేద కుటుంబానికి చెందిన బుగ్గ దుర్గాప్రసాద్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్లో బాధితుడు చికిత్స పొందుతున్నాడని తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ వంతు విరాళాలు అందజేసి రూ.19,200 ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రధానోపాధ్యాయులు జి మల్లికార్జున్‌రావు చేతుల మీదగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఈఏ ఆశీర్వాదం, శ్రీనివాస్, లావణ్య, పద్మజా కుమారి, విజయానంద్, లావరాజు, పల్లరెడ్డి సుధీర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

దెందులూరు: ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా అమలు చేసి 59 కులాలకు సమన్యాయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు తనగాల శేఖర్, బయ్యారపు రాజేశ్వరరావు అన్నారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత వద్ద తలనీలాలు సమర్పించారు. ఎంఎస్సీపీ అధికార ప్రతినిధి మద్దాల తిరుపతిరావు, గెడ్డం వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంత్యుత్సవం

పెదవేగి : దేశ జాతి పిత గాంధీజీ జయంత్యుత్సవం లో కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. పెదవేగి మండలం మంగళవారం వంగూరులో జేఅండ్‌జే కరుణోదయ విభిన్న ప్రతిభావంతులు విద్యాలయంలో రేపటి నుంచి పాఠశాలలకు సెలవుల సందర్భంగా మహాత్మగాంధీ జయంతిని ఏలూరు యూనిట్ మానవతా సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది పుచ్చల వెంకట్ తదితరులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉద్యోగి వళ్ళకవి శ్రీనివాసరావు విద్యార్థులు, సిబ్బందికి చాక్లెట్లు, బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. మానవత సభ్యులు పోడూరి కనకదుర్గ, అల్లూరి మోహిని, విష్ణు, పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ హెన్రీ డోమ్నిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

పంట నమోదు త్వరితగతిన పూర్తిచేయాలి


రైతులకు సూచనలు అందిస్తున్న షేక్ అబీబ్ బాషా

పెదపాడు: పంటల నమోదుకు రైతులు తప్పనిసరిగా ఈకేవైజీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబీబ్ బాషా తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు, కొక్కిరపాడులో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈనెల 3వ తేదీతో పంటల నమోదు ప్రక్రియ గడువు ముగిస్తున్నందున నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ ద్వారా కలిగే లాభాలను రైతులకు తెలియజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతల సమయానికి అనుగుణంగా ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వై సుబ్బారావు, పెదపాడు మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టరు కిరణ్ పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

భీమడోలు: రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీపీ ఉషారాణి అన్నారు. భీమడోలు సచివాలయం– 3, పోలసానిపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పొలం బాట పట్టిన అధికారులు రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సోకుతున్న తెగుళ్ల నివారణకు తగు సూచనలందించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షత వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొని రైతులు సమస్యలను తెలుసుకున్నారు. సర్పంచ్ షేక్ రహీమాబేగం మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు రైతులకు సాగులో మెలకువలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేసేందుకు సదస్సులు దోహద పడతాయమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యానవన అధికారి దేవనంద్, పశుసంవర్ధక శాఖ సర్జన్ రమ్యశ్రీ, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.